క్లుప్తంగా

వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ



వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేసిన లయన్స్ క్లబ్ కాకినాడ అధ్యక్షుడు రమేష్

కాకినాడ రూరల్: వేసవి ఎండల తీవ్రతతో వీధి వ్యాపారులకు లయన్స్ క్లబ్ సభ్యులు బుధవారం గొడుగులు పంపిణీ చేశారు. రమణయ్యపేట మార్కెట్ వద్ద క్లబ్ కాకినాడ చైర్మన్ డేగల రమేష్ వీటిని పంపిణీ చేస్తూ తమ క్లబ్ స్థాపించి 60 ఏళ్లు పూర్తయ్యి డైమండ్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా మహిళలకు కుట్టు మెషీన్లు, వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశామన్నారు. లయన్స్ క్లబ్ సభ్యుడు అడబాల రత్న ప్రసాద్, పీవీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ వితరణ

కరప: గ్రామంలో ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న నర్ల సూరిబాబుకు కాకినాడ రోటరీ క్లబ్ ప్రతినిధులు ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేశారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొంది మంగళవారం డిశ్చార్జి అయిన సూరిబాబు అవసరాన్ని మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ద్వారా తెలుసుకున్న క్లబ్ ప్రతినిధులు అరిగెల వెంకటేశ్వరరావు, పోలిశెట్టి ఈశ్వరరావు ఆ పరికరాన్ని బుధవారం కరపకు పంపించారు.

సాహితీ తేజం శ్రీశ్రీ

కాకినాడ రూరల్: ఆంధ్ర సాహితీ లోకాన్ని ఉత్తేజపరిచిన అభ్యుదయ కవి, నవయుగ వైతాళికుడు శ్రీ శ్రీ అని సాహితీవేత్త డాక్టర్ శిరీష పేర్కొన్నారు. శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఆయన చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

భావి తరాలకు ఉపయోగపడేలా అమరావతి నిర్మాణం

కాకినాడ సిటీ: భావి తరాలకు ఉపయోగపడేలా సీఎం చంద్రబాబునాయుడు అమరావతి నిర్మాణాన్ని చేపడుతున్నారని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి రూ.లక్ష కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారన్నారు. రెండో తేదీన ప్రధాని మోదీ అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం హర్షించదగ్గ విషయమని ఆయన తెలిపారు.

ముస్లింల మేలుకోసమే వక్ఫ్ చట్టం

బోట్‌క్లబ్: ముస్లింలకు మంచిచేసేందుకే వక్ఫ్ చట్టం రూపొందించినట్టు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. స్థానిక చోడే అప్పారావు ప్రకృతి చికిత్సాలయంలో బుధవారం వక్ఫ్ చట్టంపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వక్ఫ్ బోర్డులో అనేక వనరులు ఉన్నా కేవలం 3 శాతం మంది మాత్రమే లబ్ధిపొందుతున్నారన్నారు. ఈ చట్టం ప్రకారం 99 శాతం మంది ముస్లింలకు, ముస్లిం మహిళలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రధాని మోదీ ఈ చట్టాన్ని సవరించారన్నారు. ఇటీవల ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన సోము వీర్రాజును బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంతో సత్కరించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు, నాయకులు పైడా కృష్ణమోహన్, పెద్దిరెడ్డి రవికిరణ్, యార్లగడ్డ రామ్‌కుమార్, చిలుకూరి రామ్‌కుమార్, గోడి వెంకట్, పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

బోట్‌క్లబ్: డెయిరీ ఫారం సెంటర్ సబ్ స్టేషన్ ఆధునీకరణలో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలు నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ ఎస్.ఉదయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్ గృహకల్ప, పావురాల తూము, దుమ్ములపేట, పోర్టు ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి

సామర్లకోట: అక్షయ తృతీయ సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రం కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, సన్నిధిరాజు వెంకన్నల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేయగా అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో రాజగోపాల శర్మ, శ్రీకాకుళం సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాపం బలాదూర్

- వేసవి వేళ తాటి ముంజె దివ్యౌషధం
- నగర మార్కెట్‌లో విరివిగా విక్రయాలు
- ఆరోగ్య ప్రియులకు అమృత తుల్యం
- తనువుకూ బహుళ ప్రయోజనాలు



జీజీహెచ్ రోడ్డులో ముంజెలు విక్రయిస్తున్న వ్యాపారులు

కాకినాడ క్రైం: వేసవి వచ్చిందంటే తొలి పలకరింపు తాటి ముంజెలదే. వేసవి ఫలాలంటూ ఎన్నో ఉన్నా తాటి ముంజెలది ప్రత్యేక స్థానం. అందుకు వీటికంటూ ఉన్న ప్రత్యేకతలే కారణం. కాపు నుంచి ఆరోగ్యానికి కాపు కాసే సుగుణాల వరకు ఎన్నో ప్రత్యేకతలు తాటి ముంజెలతో ముడిపడి ఉన్నాయి. ఈ ప్రత్యేకతలే ముంజెని జనరంజక ఫలంగా మార్చాయి. అయితే, వీటి లభ్యత తక్కువ. మిగిలిన ఫలాల్లా ప్రత్యేకంగా పండించడం, డిమాండ్‌కు అనుగుణంగా దిగుబడికి హైబ్రీడ్ విధానాలు అనుసరించడం జరగదు. తాటి తోటలంటూ ఎక్కడా ఉండవు. ఈ నేపథ్యంలో వీటి లభ్యత కూడా అంతంత మాత్రమే. పల్లెల్లో, జనాసంచారం లేని దూరపు ప్రాంతాల్లో తప్ప ఇంకెక్కడా తాటి చెట్ల జాడ కానరాదు. వీటి నుంచే తాటి ముంజెల్ని వేరు చేస్తారు. మింగితే గుటుక్కుమని నోటిని అమృతమయం చేసే తాటి ముంజె జనాలకి చేర్చేందుకు వ్యాపారులు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వ్యాపారంలా జనాలకి కనిపించినా, సీజనల్ ఫలాన్ని అందిస్తున్నామన్న సంతృప్తి పల్లెటూరు రైతుది. ఓ తాటి కాయలో ముంజెల బరువు కేవలం ఐదవ వంతు మాత్రమే. ఆ మాత్రం కోసం వందలాది తాటి కాయల బరువుని తమ ద్విచక్రవాహనాలకు కట్టుకొని వచ్చి మండుటెండలో తాజాగా అప్పటికప్పుడు తాటి కాయ నుంచి వేరు చేసి ముంజెలు అందిస్తూ ఉంటారు.

కాకినాడలో

కాకినాడ నగరంలో తాటి ముంజెల విక్రయం గడచిన పది రోజులుగా ఊపందుకుంది. వినియోగదారులూ కొని తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. పల్లెల నుంచి ఉదయాన్నే రైతులు జనం రద్దీగా ఉండే ప్రాంతాలను ఎంచుకుని విక్రయాలు చేపడుతున్నారు. ప్రధాన కూడళ్ల సమీపంలో రోడ్ల పక్కన తాటాకు నీడ చాటున మండు టెండలో చల్లని ముంజెల్ని అందిస్తున్నారు. కాకినాడలో జీజీహెచ్ రోడ్‌లో, జేఎన్‌టీయూ ఎదురుగా, ఆశ్రం స్కూల్ సమీపంలో, బాలాజీ చెరువు జంక్షన్‌లో తాటి ముంజెల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి.

ఈ మూడు ప్రాంతాల నుంచి

కాకినాడ జిల్లాకు చెందిన పెద్దాపురం, రాజగోపాలపట్టణం, సూరంపాలెం నుంచి ముంజెలు తెచ్చి కాకినాడ నగరంలో విక్రయిస్తున్నారు. అక్కడ రైతులు ఉదయాన్నే తాటి చెట్ల వద్దకు వెళ్లి తాటికాయలు దింపుతారు. వాటిని బస్తాల్లో బిగించి తమ ద్విచక్రవాహనాలపై కాకినాడకు తీసుకు వచ్చి కాయ నుంచి ముంజెను వేరు చేసి విక్రయిస్తారు.

కొనేందుకు ఖర్చు లేకున్నా

విక్రేతలు ఎవరూ కొనేందుకు డబ్బు వెచ్చించడం లేదు. అయితే తాటి చెట్టు నుంచి గెలలు నరకడం, దింపడం, వాటిని నగరానికి తరలించడం మాత్రం వ్యయం, శ్రమతో కూడుకున్న పని. ఇలా విక్రయిస్తూ ఈ వ్యయం పోగా కనీసం రూ. వెయ్యి నుంచి రూ.1500 మొత్తాన్ని ఇంటికి తీసుకు వెళతామని చెబుతున్నారు.

తాటికాయల లభ్యత కష్టంగా మారింది



వేసవి రాకను మొట్ట మొదటిగా చెప్పేది తాటి ముంజెలే. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యలోనే ఇవి లభిస్తాయి. పెంపకంలో ఎటువంటి కల్తీ ఉండదు. పోటీ నెలకొనడం వల్ల తాటికాయల లభ్యత కష్టంగా మారింది. వ్యాపారులు పెరిగినా అందుకు తగ్గ రీతిలో దిగుబడి లేదు. తాటి చెట్ల పోషణకు ప్రభుత్వాలు చొరవచూపాలు. వీటిని ఆదాయ వనరుగా మలిచేలా చర్యలు తీసుకోవాలి. పెంపకానికి తగిన ప్రోత్సాహం కల్పించాలి. వ్యాపారాలు ఎంత మంది వచ్చినా ఉన్నంతలో సర్దుకునే పరిస్థితి మాత్రమే కొనసాగుతోంది. కష్టించి పనిచేసి సంపాదించాలన్నా అందుకు తగ్గ స్థాయిలో లభ్యత లేదు.

– సమ్మింగి శ్రీను, రాజగోపాలపట్టణం, తాటి ముంజెల వ్యాపారి

డజను రూ.100



ముంజెల ధరలు గతం కంటే ఎక్కువగా పెరిగాయి. డజను ముంజెలు కొనేందుకు రూ.100 వెచ్చించాల్సి ఉంటుంది. అలా కొనాలన్నా దొరికే పరిస్థితి లేదు. లభించడం కూడా కష్టతరమవుతోంది. పారదర్శకంగా, ఆకర్షణీయంగా ఉండే ముంజెలు తినేందుకు అన్ని వర్గాల ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా డిమాండ్ పెరిగింది. వ్యాపారులు అందుబాటు ధరలకు విక్రయించి ముంజెల ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు అందించాలి.

– దిండి రవికుమార్, కాకినాడ వాసి

ముంజెల జ్యూస్ ఆరోగ్యకరం



తాటి ముంజెలతో చేసే జ్యూస్ ఎంతో ఆరోగ్యకరం. జ్యూస్ తయారు చేసే ప్రక్రియలో వివిధ పదార్థాలు కలిపి మరింత పోషకంగా చేస్తాం. ముంజెల పాయసం, కొబ్బరి తురుము, జీడిపప్పు కలిపి ముంజెల కస్టర్డ్, హల్వా ఇలా ఎన్నో ఆహార పదార్థాలు ముంజెలతో తయారు చేయవచ్చు. ముంజెలుతో చేసే పానీయాలు మధుమేహ బాధితులు కూడా స్వీకరిస్తారు. వారి ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెబుతారు.

– కోలా సత్యనారాయణ, హాట్ అండ్ కూల్ జ్యూస్ పాయింట్, కాకినాడ

పోషకాలు మెండు



చూడడానికి ఆకర్షణీయంగా ఉండే ముంజెలో ఎన్నో విలువైన పోషకాలు ఉన్నాయి. శరీర వేడిని నియంత్రించడంలో ముంజె దిట్ట. మూత్రపిండాల సమస్యతో పాటు నిస్సత్తువ, ఎసిడిటీ, ఉబ్బసాన్ని ముంజెలు తొలగిస్తాయి. వేసవి వేళ వడదెబ్బకు గురికాకుండా కాపాడుతుంది. చర్మంలో తేమ నిల్వ ఉంచేందుకు, జుట్టు ఆరోగ్యానికి ముంజెలు ఎంతో దోహదపడతాయి. డీహైడ్రేషన్‌ను దూరం చేసి మలబద్ధకాన్ని నివారిస్తాయి. ఇందులో సహజ చక్కెరలు, విటమిన్-బి సహా, పొటాషియం, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. ముంజెలు ఎంచుకోవడం తెలియాలి. ముదురు ముంజెలు తింటే జీర్ణవ్యవస్థకు ఆటంకం ఏర్పడి కడుపు నొప్పి వచ్చే అవకాశం ఉంది. చర్మ సౌందర్యానికి కూడా ముంజెల గుజ్జు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుంది. చర్మానికి లేపనంగా రాస్తే మచ్చలు, అలర్జీలు తగ్గిపోతాయి.

– డాక్టర్ ఉదతా సుధీర్, కాకినాడ

ఘనంగా చందనోత్సవ పూజ



చందనోత్సవం అనంతరం స్వామివారు

బోట్‌క్లబ్: అక్షయ తదియ సందర్భంగా స్థానిక గొడారిగుంట జర్నలిస్ట్ కాలనీలో ఉన్న రమా సహిత సత్యదేవ మందిర ప్రాంగణంలో చందనోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. మధ్వ పురోహితులు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. గత మూడు దశాబ్దాలుగా చందనోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మతీర్థ స్వామీజీ ఆశీస్సులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అక్షయ తదియ రోజున పూజ, ధ్యానం, జపం, గ్రంథ పఠనంతో పాటు గురువుల నామస్మరణ ద్వారా భగవంతుని అనుగ్రహం పొందవచ్చునన్నారు. ఈ సందర్భంగా అమూల్య రుక్మిణి, తుంగమణి, భక్తి గీతాలు ఆలపించారు.

గ్రీవెన్స్ వినతుల పరిష్కారాలపై అవగాహన

కాకినాడ సిటీ: పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా అందిన ప్రజా విజ్ఞాపనల పరిష్కార సమర్థత, నాణ్యతల ఆడిట్ ప్రక్రియలపై బుధవారం ముఖ్యమంత్రి కార్యాలయ చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు. అర్జీదారుల సమస్యలపై సంతృప్తికరమైన సత్వర పరిష్కారం అందించడానికి అనుసరించాల్సిన విధి విధానాలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, డీఎల్డీవో పి. వాసుదేవరావు, వివిధ శాఖల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన



బాల్య వివాహల నివారణపై ప్రమాణం చేయిస్తున్న పీవో విజయ

కాకినాడ క్రైం: జిల్లా స్త్రీ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై జిల్లాలో పలు చోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పీడీ విజయకుమారి పర్యవేక్షణలో, డీసీపీవో వెంకట్ ఆధ్వర్యాన జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి (పీవో) జాగరపు విజయ ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని విరివిగా వివాహాలు జరగనున్న నేపథ్యంలో బాల్య వివాహాలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో అన్నవరంలోని కొత్తపేట అంగన్వాడీ కేంద్రంలో బాల్యవివాహాల నివారణపై అవగాహన కల్పించి, దురాచారాన్ని రూపుమాపుతామని పీవో విజయ అక్కడి వారి చేత ప్రమాణం చేయించారు. అలాగే, కత్తిపూడి బస్టాండ్ సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో సదస్సు నిర్వహించి గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో ప్రజలు, స్థానిక నాయకులు, అంగన్వాడీ సిబ్బంది చేత ప్రమాణం చేయించి బాల్య వివాహాల వల్ల జరిగే భవిష్యత్ అనర్థాలను విజయ వివరించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ నాయకులతో పాటు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మున్సిపల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రమణగౌడ్

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జిల్లాకు చెందిన రేలంగి రమణగౌడ్‌కు స్థానం కల్పించారు. ఇటీవల కాలంలో జిల్లాకు చెందిన పలువురు నాయకులు రాష్ట్ర, జిల్లా స్థాయి పదవులు కేటాయించడంతో పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిటీ యువజన విభాగం అధ్యక్షుడిగా రోకళ్ల



రోకళ్ల సత్యనారాయణ

బోట్‌క్లబ్: వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ యువజన విభాగం అధ్యక్షుడిగా మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ నియమితులయ్యారు. యువజన విభాగం అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యనారాయణను సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు అభినందించారు.

భక్తుల ప్రాణాలు విలువైనవి కాదా?

జమ్మలమడక నాగమణి



కాకినాడ రూరల్: అక్షయ తృతీయ వేడుకలలో భాగంగా సింహాచలం అప్పన్న చందనోత్సవం చూసేందుకు వెళ్లిన భక్తులు అక్కడ ప్రభుత్వంచే నిర్మింపబడిన నాసిరకం గోడ కూలి ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమనీ ఇది కచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. అక్షయ తృతీయ రోజున స్వామి వారిని దర్శించుకుంటే తమ కుటుంబాలకు మంచి జరుగుతుందని భావించి ఏటేటా భక్తులు సింహాచలం అప్పన్నను దర్శించుకుంటారని, కొండకు వచ్చే భక్తుల కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేయాల్సి ఉందని, మూడు రోజుల క్రితం నిర్మించిన గోడ కూలిపోవడం ఈ ఘటనకు కారణమని ఆమె పేర్కొన్నారు. హోంమంత్రి అనిత సొంత జిల్లాలోనే ఇటువంటి సంఘటనలు జరగడం హిందూ దేవాలయాల పట్ల, భక్తుల పట్ల వారి చిత్తశుద్ధి ఏమిటో ప్రజలకు అర్థం అయిందన్నారు. సింహగిరిపై చందనోత్సవానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని తెలిసీ ముందస్తు ఏర్పాట్లు చేయాల్సిన ప్రభుత్వం కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు తీసుకుని అవినీతికి పాల్పడినట్టు చెప్పకనే చెప్తోందని ఆమె అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం విలువ భక్తుల ప్రాణం అని అన్నారు. తిరుపతి సంఘటన ఇంకా మరువక ముందే సింహాచలంలో జరిగిన ఈ సంఘటన ప్రభుత్వం వైఫల్యమని మరోసారి తేటతెల్లమైందని, హిందువున్నా హిందూ దేవాలయాలన్నా హిందూ సంస్కృతి సాంప్రదాయాలన్నా ఈ ప్రభుత్వానికి అంత చులకన భావం, నిర్లక్ష్యం ఏమిటని ఆమె ప్రశ్నించారు. తక్షణం మృతుల కుటుంబాలను ఆదుకోవాలని క్షతగాత్రులకు తగిన వైద్య సదుపాయాలు కల్పించి ఆ కుటుంబాలకు భరోసా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

- మిల్లర్లకు జేసీ రాహుల్ మీనా ఆదేశం
- నియోజకవర్గంలో నిల్వల పరిశీలన



సామర్లకోటలో రైతు సమస్యలను జేసీకి వివరిస్తున్న కంటే బాబు

పెద్దాపురం: రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లు పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టామని, రైతులు అధైర్యపడవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు గ్రామాల్లో బుధవారం ఆయన ధాన్యం కళ్లాలను పరిశీలించి, రైతులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మీనా మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని సీఎంఆర్ పథకంలో మిల్లర్లు కొనుగోలు చేసేలా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఆయన వెంట ఏడీఏ దైవకుమార్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఏఓ సంజయ్‌కుమార్, పౌర సరఫరాల డీఎం నాయక్, రైతులు ఉన్నారు.

ధాన్యం నిల్వల పరిశీలన

సామర్లకోట: స్థానిక భీమేశ్వరస్వామి ఆలయ సమీపంలోని ధాన్యం స్టాక్ పాయింట్‌ను బుధవారం సాయంత్రం జేసీ రాహుల్ మీనా పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకండా చూడాలన్నారు. ఆయన వెంట ఏడీఏ రత్నప్రశాంతి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఓ సత్య, డీఎం నాయక్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి

నియోజకవర్గ పరిధిలో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు జాయింట్ కలెక్టర్‌ను కోరారు.. నియోజకవర్గంలో రెండు అతి పెద్ద రైస్ మిల్లులు ఉన్నప్పటికీ సీఎంఆర్ ధాన్యం కొనడంలేదని ఆరోపించారు. వారు ధాన్యాన్ని కొన్నట్టు అయితే సమస్య ఉండదన్నారు. సీఎంఆర్ కాకుండా నగదు పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల రైతులకు నగదు సర్దుబాటు కావడానికి నెల రోజులు పడుతుందన్నారు. సీఎంఆర్‌లో ధాన్యం కొనుగోలు చేస్తే 48 గంటల్లోనే ధాన్యం సొమ్ము పడుతుందన్నారు. దీనిపై జేసీ స్పందిస్తూ రైస్ మిల్లర్లతో చర్చించి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అపర్ణాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అపర్ణాదేవి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసియున్న అపర్ణాదేవికి బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసినట్టు ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించగా పలువురు మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



నడకుదురు పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు

కరప: మండలం నడకుదురులోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు హెచ్ఎం వాకాడ వెంకటరమణ బుధవారం తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ శిబిరానికి పంపించి సహకరించాలన్నారు. ఈ పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేశారని, ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఇక్కడ ఉంటాయని, విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు ఎంఈఓలు కె.బుల్లి కృష్ణవేణి, పి.సత్యనారాయణ సూచనల మేరకు వేసవి తరగతులను ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల పదో తేదీ వరకు, తిరిగి జూన్ నెల ఒకటో తేదీ నుంచి 11వ తేదీ వరకు వేసవి తరగతులు ఉంటాయన్నారు. తనతో పాటు ఉపాధ్యాయిని కె.విజయలక్ష్మి పిల్లలకు 9 రకాల యాక్టివిటీస్ నేర్పించి, వారిచే చేయించి ఉత్సాహం కల్పిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన టీచర్లు, రిసోర్స్ పర్సన్లు ప్రత్యేకంగా పప్పెట్ షోలు, గణితంలో మెళకువలు, మట్టితో బొమ్మల తయారీ, కర్సివ్ రైటింగ్, చిత్రలేఖనం, చెస్, సంగీతం వంటివి నేర్పిస్తామన్నారు. ఐదేళ్ల నుంచి పదేళ్ల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం కోరారు.

ప్రభుత్వ ఐటీఐలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2025-26 విద్యా సంవత్సరానికి వివిధ ట్రేడుల్లో శిక్షణ కోసం సెంటాక్ పోర్టల్ ద్వారా మే 9 నుంచి అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నారని బుధవారం ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణ సుధాకర్ తెలిపారు. ఆసక్తిగలిగిన యానాం రీజియన్ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైర్‌మేన్, మెకానిక్ మోటార్ వెహికల్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ ట్రేడుల్లో శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 0884-2951001, 9491441164 ను సంప్రదించాలని కోరారు.

వృక్ష విలాపం..





ఉప్పాడలో తలలు తెగిపడిన వృక్షాలు
(అంతర చిత్రం) వాకతిప్పలో పరిస్థితి ఇదీ..

కొత్తపల్లి: అటవీ, విద్యుత్ శాఖల సమన్వయ లోపంతో విలువైన వృక్ష సంపద నేలకొరుగుతోంది. కష్టపడి పెంచిన మొక్కలపై అటవీశాఖకు ప్రేమ లేకపోవడం ఒక బాధైతే, తమ తీగలకు అడ్డొస్తున్నాయని విద్యుత్ శాఖ ఇష్టం వచ్చినట్టు మోడు మొదలంటా నరికేస్తుండడం మరొక వ్యథ. మండలంలో ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో మొక్కలు ఏపుగా పెరిగి రహదారికి ఇరువైపులా సుందరంగా దర్శనమిస్తూ ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు తమ విద్యుత్ తీగలకు తగులుతున్నాయని చెట్ల కొమ్మలను కోడిమెడ విరిచినట్టు, మేక తల నరికినట్టు ఇష్టానుసారం ధ్వంసం చేశారు. మొక్కలు నాటినప్పుడు నోరు మెదపని విద్యుత్ అధికారులు నేడు విద్యుత్ లైన్లు కోసం చెట్ల తలలు తెగనరుకుతున్నారు. ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి ఏటా లక్షలాది మొక్కలు నాటుతుంటే అవి నాటడం వెనుక ఉన్న లక్ష్యాన్ని విస్మరించి ఇష్టారీతిన నరకడం బాధాకరమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా నందీశ్వరుని ఉత్సవాలు



నందీశ్వరుని దర్శించుకుంటున్న భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం ఎదురుగా కొలువై ఉన్న నందీశ్వరుని సంబరాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితుడు ద్విభాష్యం సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో మహా గణపతి పూజ, పుణ్యాహవాచనం మండపారాధన, నందీశ్వరుడికి అభిషేకం అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని గోపాలకృష్ణ ఆలయ సేవాసమితి బృందం, నందీశ్వర ఉత్సవ సేవా సమితి సభ్యులు తెలిపారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. భక్తులు నందీశ్వరుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

పెద్దాపురం: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథాలయాధికారి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం పుస్తక పఠనం, కథలు చదవడం నేర్పించారు. ఇటువంటి శిబిరాలకు విద్యార్థులను ప్రోత్సాహించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు.